వనమహోత్సవంలో భాగస్వాములను చేయాలి

వీసీలో రాష్ట్ర ముఖ్య కార్యదర్శి రామకృష్ణారావు

వీసీలో పాల్గొన్న కలెక్టర్, అధికారులు

భద్రాద్రి కొత్తగూడెం, జూన్ 24 (నమస్తే తెలంగాణ) : ప్రతి ఒక్కరికీ భాగస్వాములను చేస్తూ వనమహోత్సవం కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని రాష్ట్ర ముఖ్య కార్యదర్శి కె.రామకృష్ణారావు అన్నారు. మంగళవారం హైదరాబాద్ నుంచి సీఎస్.. ప్రభుత్వ ప్రధాన కార్యక్రమాలపై కలెక్టర్లతో వీడియో కాన్ఫరెన్స్ ద్వారా సమీక్షించారు. ఆన్‌లైన్ నుంచి రాష్ట్ర అటవీ పర్యావరణ శాఖ మంత్రి కొండా సురేఖ హాజరయ్యారు. వీసీలో కలెక్టర్ జితేశ్ వి పాటిల్.. జిల్లా అటవీ శాఖ అధికారి కృష్ణాగౌడ్, ట్రైనీ కలెక్టర్ సౌరబ్ శర్మతో కలిసి ఐడీవోసీ నుంచి పాల్గొన్నారు. వనమహోత్సవం, ఇందిరమ్మ ఇండ్లు, ఎరువుల లభ్యత, ఆయిల్‌పామ్ పంట విస్తరణ, సీజనల్ వ్యాధుల నియంత్రణకు చర్యలు, భూభారతి ధరఖాస్తుల పరిష్కారం వంటి పలు అంశాలపై సీఎస్ సుధీర్ఘంగా చర్చించి పలు సూచనలు చేశారు. అనంతరం కలెక్టర్ మాట్లాడుతూ.. వనమహోత్సవంలో 70 లక్షల మొక్కలు నాటేందుకు అన్ని చర్యలు తీసుకున్నామని చెప్పారు. అదనపు కలెక్టర్లు వేణుగోపాల్, విద్యాచందన, డీపీవో బాబూరావు, డీఎంహెచ్‌వో భాస్కర్‌నాయక్, జిల్లా ఉద్యాన అధికారి కిశోర్ తదితరులు పాల్గొన్నారు.

సంక్షేమ పథకాలను సద్వినియోగం చేసుకోవాలి

ఎమ్మెల్యే తెల్లం వెంకట్రావ్, పీవో రాహుల్

గుర్తింపు కార్డులు అందిస్తున్న ఎమ్మెల్యే, పీవోలు

దుమ్ముగూడెం, జూన్ 24: అటవీ ప్రాంతాల్లో నివసించే గిరిజన కుటుంబాలు కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వ పథకాలను సద్వినియోగం చేసుకుని ఆర్థికంగా ఎదగాలని భద్రాచలం ఎమ్మెల్యే తెల్లం వెంకట్రావు అన్నారు. మంగళవారం ఐటీడీఏ పీవో రాహుల్‌తో కలిసి మండల పరిధిలోని నర్సాపురం రైతువేదికలో ధర్తి అభాజ జాతీయ గ్రామ్ ఉత్కర్ష అభియాన్ యోజన సదస్సుకు హాజరయ్యారు. అనంతరం ప్రజలకు గుర్తింపు కార్డులు అందించారు. ఈ కార్యక్రమంలో ఏపీవో జనరల్ డేవిడ్‌రాజ్, ఏవో సున్నం రాంబాబు, ఎంపీడీవో రామకృష్ణ, ఎంఈవో సున్నం సమ్మయ్య, ఆర్ఐ వెంకటేశ్వర్లు, సూరిబాబు, ఏవో నవీన్‌కుమార్, ఐకేపీ ఏపీఎం హేమంతిని, సుకన్య పాల్గొన్నారు.

లబ్ధిదారులు మూడు నెలల రేషన్ తీసుకోవాలి

దుమ్ముగూడెం, జూన్ 24: మండలంలో తెల్లరేషన్ కార్డు కలిగి ఉన్న లబ్ధిదారులు జూన్, జూలై, ఆగస్టు నెలలకు సంబంధించి సన్నబియ్యం తీసుకోవాలని భద్రాచలం డీటీ రాజులు మంగళవారం తెలిపారు. మండలంలోని రేషన్ డీలర్లు, డీఆర్ డిపోలకు సంబంధించిన సేల్స్‌మెన్లు ఉదయం, సాయంత్రం రెండు పూటలా చౌక దుకాణాలు తెరిచి ఉంచి సన్నబియ్యం ఇవ్వాలని, దుకాణాలు తెరవని పక్షంలో వారిపై శాఖాపరమైన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు.

కానిస్టేబుల్‌పై హత్యాయత్నం

కొత్తగూడెం ప్రగతి మైదాన్, జూన్ 24 : మావోయిస్టు పార్టీకి చెందిన స్మాల్ యాక్షన్ టీమ్ ఓ కానిస్టేబుల్‌పై హత్యాయత్నానికి పాల్పడింది. ఈ ఘటన ఛత్తీస్‌గఢ్ రాష్ట్రం బీజాపూర్ జిల్లాలో మంగళవారం చోటు చేసుకుంది. వివరాలు ఇలా ఉన్నాయి. బీజాపూర్ జిల్లా పదేడ్ గ్రామానికి చెందిన కానిస్టేబుల్ సంతు పోతం తన ప్రాంతంలోని మార్కెట్‌కి వెళ్లాడు. ఈ క్రమంలో ఇదే అదునుగా భావించిన మావోయిస్టు పార్టీ స్మాల్ యాక్షన్ టీమ్ సంతుపై దాడి చేసి, ఆయుధాలతో తీవ్రంగా గాయపరిచి అక్కడి నుంచి పారిపోయారు. గ్రామస్తుల ద్వారా సమాచారం తెలుసుకున్న పోలీసులు ఘటనా స్థలానికి చేరుకుని క్షతగాత్రుడిని ఆసుపత్రికి తరలించారు. ప్రస్తుతానికి కానిస్టేబుల్ పరిస్థితి విషమంగా ఉన్నట్లు వైద్యులు తెలిపారు. ఈ ఘటనపై పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

అరుణాచలం గిరి ప్రదక్షిణకు సూపర్ లగ్జరీ బస్సులు

మణుగూరు టౌన్, జూన్ 24: మణుగూరు నుంచి అరుణాచలం గిరి ప్రదక్షిణకు సూపర్ లగ్జరీ బస్సు ఏర్పాటు చేసినట్లు మణుగూరు డిపో మేనేజర్ శ్యాంసుందర్ మంగళవారం ఒక ప్రకటనలో తెలిపారు. జూలై 8 వ తేదీ సాయంత్రం 6 గంటలకు మణుగూరు డిపో నుంచి బయల్దేరి భద్రాచలం నుంచి కొత్తగూడెం మీదుగా కాణిపాకం శ్రీ విఘ్నేశ్వరస్వామి ఆలయం, గోల్డెన్ టెంపుల్, జూలై 10వ తేదీన అరుణాచలం చేరుకుంటుందన్నారు. ఈ సదవకాశాన్ని మణుగూరు పరిసర ప్రాంత ప్రజలు, భక్తులు సద్వినియోగం చేసుకోవాలని, పెద్దలకు రూ.5500, పిల్లలకు రూ.2750 మాత్రమేనని తెలిపారు. వివరాలకు 9959225963, 7382858121, 6305335304 నంబర్లకు సంప్రదించాలని, టిక్కెట్లు ఆన్‌లైన్ రిజర్వేషన్ చేసుకోవచ్చని, రిజర్వేషన్ నంబర్ 55444 అని తెలిపారు.

వ్యక్తి అనుమానాస్పద మృతి

పాల్వంచ రూరల్, జూన్ 24: ఓ వ్యక్తి అనుమానాస్పద స్థితిలో మృతిచెందాడు. పోలీసులు తెలిపిన వివరాలు.. మండలంలోని మందెరికలపాడుకు చెందిన కాటి అయోధ్యకు, పూసల తండాకు చెందిన బదావత్ సంధ్యతో తొమ్మిది నెలల క్రితం వివాహమైంది. రెండు నెలల తర్వాత ఆ దంపతులు జీవనోపాధి కోసం హైదరాబాద్ వెళ్లారు. అక్కడ ఆటో డ్రైవర్‌గా అయోధ్య చేరాడు. మూడు వారాల క్రితం ఈ దంపతులు మందెరికలపాడు వచ్చారు. అత్తారింట్లో గొడవ జరగడంతో సంధ్య తన పుట్టింటికి వెళ్లింది. భార్యను తీసుకొచ్చేందుకు పూసల తండాకు ఈ నెల 23న అయోధ్య వెళ్లాడు. అమ్మాయిని తర్వాత పంపిస్తామని సంధ్య తల్లిదండ్రులు అయోధ్యకు నచ్చజెప్పి పంపించారు. మరుసటి రోజున, మందెరికలపాడు శివారులో చెట్టుకు అయోధ్య మృతదేహం ఉరికి వేలాడుతుండడాన్ని స్థానికులు మంగళవారం గమనించి, అతని తల్లిదండ్రులతో చెప్పారు. అయోధ్య తండ్రి వీరభద్రం ఫిర్యాదుతో 'అనుమానాస్పద మృతి'గా రూరల్ ఎస్సై సురేష్ కేసు నమోదు చేశారు. దర్యాప్తు జరుపుతున్నారు.

వ్యక్తి ఆత్మహత్య

ఇల్లెందు, జూన్ 24: భార్యాపిల్లలు రెండు నెలలుగా దూరంగా ఉండడాన్ని తట్టుకోలేక ఓ వ్యక్తి ఆత్మహత్య చేసుకున్నాడు. ఇల్లెందు సీఐ బత్తుల సత్యనారాయణ తెలిపిన వివరాలు.. ఇల్లెందు 24 ఏరియా చెరువు కట్ట ప్రాంతానికి చెందిన మిట్టపల్లి సతీష్(36) దినసరి కూలీగా పనిచేస్తున్నాడు. రెండు నెలలుగా భార్యాపిల్లలు ఆయనకు దూరంగా ఉంటున్నారు. దీనిని తట్టుకోలేని అతడు మంగళవారం సాయంత్రం తన ఇంటి వద్ద ఉరి వేసుకుని ఆత్మహత్య చేసుకున్నాడు. అతడి తండ్రి రాజలింగం ఫిర్యాదుతో కేసును సీఐ సత్యనారాయణ నమోదు చేశారు.

మన రాష్ట్రం మన పత్రిక
నమస్తే తెలంగాణ
నమస్తే తెలంగాణ దినపత్రికలో
చందా కొరకై మరియు పత్రికా పంపిణీలో
ఏమైన సమస్యలు ఉంటే సంప్రదించగలరు
సెల్ : 9182777073
నమస్తే తెలంగాణ దినపత్రికలో అన్ని రకాల
ప్రకటనలు (అడ్వర్టైజ్‌మెంట్స్) కొరకు సంప్రదించగలరు
సెల్ : 9182777616

ప్రజా పాలనా.. రాక్షస పాలనా?

మహిళలపై దాడి ఘటనతో ఆదివాసీ మంత్రి, ఎమ్మెల్యేలు సిగ్గుతో తలదించుకోవాలి

బూర్గంపహాడ్ మండలం కోసగుంపును సందర్శించిన తుడుందెబ్బ రాష్ట్ర బృందం

కోసగుంపు గిరిజనులను పరామర్శిస్తున్న తుడుందెబ్బ రాష్ట్ర అధ్యక్షుడు మైపతి అరుణ్‌కుమార్, పొడియం బాలరాజు, వట్టం సుభద్ర, ఆదివాసీ నేతలు

బూర్గంపహాడ్, జూన్ 24 : పోడు సాగు చేసుకుంటున్న ఆదివాసీ గిరిజన మహిళలపై అటవీ శాఖ అధికారులు విచక్షణా రహితంగా దాడి చేయడం దుర్మార్గపు చర్య అని, తెలంగాణ రాష్ట్రంలో ప్రజా పాలన నడుస్తుందా? రాక్షస పాలన నడుస్తుందా? అని తుడుం దెబ్బ రాష్ట్ర అధ్యక్షుడు డాక్టర్ మైపతి అరుణ్‌కుమార్ మండిపడ్డారు. 78 ఏళ్ల స్వతంత్ర భారతదేశంలో నేటికీ మహిళల బట్టలు చింపడం, చెంపలపై కొట్టడం, బూటుకాళ్లతో తన్నడం వంటి ఘటనలు చూడాల్సి వస్తుందని ఆవేదన వ్యక్తం చేశారు. బూర్గంపహాడ్ మండలం కోసగుంపు గ్రామంలో ఇటీవల అటవీ శాఖ అధికారుల దాడిలో గాయపడిన ఆదివాసీ గిరిజన మహిళలను మంగళవారం ఆయన ఏఈడబ్ల్యూసీఈఏ(ఆదివాసీ ఎంప్లాయిస్ వెల్ఫేర్ కల్చర్ అసోసియేషన్) రాష్ట్ర నేత పొడియం బాలరాజు, ఆధార్ సొసైటీ రాష్ట్ర కమిటీ సభ్యుడు రాంబాబు, ఆదివాసీ మహిళా సంఘం రాష్ట్ర అధ్యక్షురాలు వట్టం సుభద్ర, ఆదివాసీ నేతలతో కలిసి పరామర్శించారు. ఈ సందర్భంగా అరుణ్‌కుమార్ మాట్లాడుతూ పోడు సాగు చేసుకుంటున్న గిరిజన ఆడబిడ్డలపై దాడి చేసి దుస్తులు చింపి, చేతులు, కాళ్లు లాగుతూ పాశవికంగా దాడికి తెగబడడం ఆటవిక చర్యగా అభివర్ణించారు. మంత్రిగా ఉన్న సీతక్క, ఎమ్మెల్యే పాయం, జిల్లాలోని ఆదివాసీ ఎమ్మెల్యేలు తెల్లం వెంకట్రావు, కోరం కనకయ్య, ట్రైబల్ అడ్వైజరీ కమిటీకి బాధ్యత వహించే ప్రతి ఆదివాసీ ఎమ్మెల్యేలు సిగ్గుతో తలదించుకోవాల్సిన ఘటన ఇది అని, ఆదివాసీ మహిళలకు రక్షణ కల్పించలేని మీకు పదవులు ఎందుకని, వెంటనే అందరూ రాజీనామా చేయాలని డిమాండ్ చేశారు. ఈ ఘటనపై జాతీయ ఎస్సీ, ఎస్టీ కమిషన్, మానవ హక్కుల కమిషన్‌కు ఫిర్యాదు చేస్తామన్నారు. కార్యక్రమంలో ఆదివాసీ జిల్లా నేత గనిబోయిన శ్రీను, బొర్రా భద్రయ్య, పొడియం నరేందర్, ఆదివాసీ విద్యార్థి నాయకులు కొమరం రవి, గట్టిపల్లి అర్జున్, గొంది రంజిత్, రాకేశ్ పాల్గొన్నారు.

వ్యసనాలకు బానిసలు కావొద్దు: ఎస్పీ రోహిత్‌రాజు

మాదక ద్రవ్యాల నిర్మూలన పోస్టర్లు ఆవిష్కరిస్తున్న ఎస్పీ రోహిత్ రాజు

కొత్తగూడెం ప్రగతి మైదాన్, జూన్ 24 : నేటి యువత, విద్యార్థులు చెడు వ్యసనాలకు బానిసలు కావొద్దని, చదువుపై దృష్టి సారించి ఉన్నత స్థాయికి ఎదగాలని భద్రాద్రి ఎస్పీ రోహిత్‌రాజు ఆకాంక్షించారు. అంతర్జాతీయ మాదక ద్రవ్యాల నివారణ అవగాహన వారోత్సవాల్లో భాగంగా కొత్తగూడెంలోని తన కార్యాలయంలో మంగళవారం పోస్టర్లను విడుదల చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ మనుషుల ప్రాణాలను హరించే మాదక ద్రవ్య మహమ్మారిని నిర్మూలించడం ప్రతీ ఒక్క పౌరుడి బాధ్యత అని అన్నారు. మాదక ద్రవ్యాల వాడకం వల్ల ఏర్పడే అనారోగ్య సమస్యలు, ఆర్థిక, సామాజిక దుష్పరిణామాలపై పోలీస్ శాఖ తరపున జిల్లా ప్రజలకు అవగాహన కార్యక్రమాలు కల్పించాలని సూచించారు. అనంతరం మాదక ద్రవ్యాల నిర్మూలనే లక్ష్యంగా ముద్రించిన 'మిషన్ పరివర్తన్' పోస్టర్లను ఆవిష్కరించారు.

బూర్గంపహాడ్, జూన్ 24: యువత, విద్యార్థులు మాదకద్రవ్యాలు, చెడు అలవాట్లతో భవిష్యత్‌ను నాశనం చేసుకోవద్దని బూర్గంపహాడ్ ఎస్సై నాగభిక్షం అన్నారు. మంగళవారం మండల కేంద్రమైన బూర్గంపహాడ్ జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో ముక్త భారత్ అభియాన్, దక్షత సొసైటీల ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన అవగాహన సదస్సులో ఐసీడీఎస్ సీడీపీవో రేవతితో కలిసి మాట్లాడారు. విద్యార్థులు, యువత చెడు అలవాట్లకు దూరంగా ఉండడంతో పాటు గంజాయి, ఇతర మాదకద్రవ్యాల జోలికి పోవద్దని సూచించారు.

రామవరం, జూన్ 24: మాదక ద్రవ్యాలతో జీవితాలు నాశనమవుతాయని టూ టౌన్ సీఐ ప్రతాప్ హెచ్చరించారు. మాదక ద్రవ్యాల దుష్ఫలితాలపై స్థానిక పాలిటెక్నిక్ కాలేజీలో విద్యార్థులకు మంగళవారం అవగాహన కార్యక్రమం నిర్వహించారు. సీఐ మాట్లాడుతూ.. సమాజంలో అన్ని రకాల సమస్యలకు మాదక ద్రవ్యాలు దారితీస్తాయని చెప్పారు. డ్రగ్స్‌ను ఒక్కసారి వాడితే.. అది వ్యసనంగా మారుతుందని, జీవితాన్ని నాశనం చేస్తుందని చెప్పారు.

పాల్వంచ, జూన్ 24: మాదక ద్రవ్యాలతో కలిగే నష్టాలపై స్థానిక అనుబోస్ మహిళా ఇంజినీరింగ్ కాలేజీలో మంగళవారం అవగాహన సదస్సును సీఐ సతీష్ కుమార్ నిర్వహించారు. మాదక ద్రవ్యాలను విక్రయించినా, వినియోగించినా కఠిన చర్యలు తీసుకుంటామని చెప్పారు.

ఇల్లెందు, జూన్ 24: మాదక ద్రవ్యాలతో కలిగే నష్టాలపై స్థానిక జేబీఎస్ పాఠశాలలో మంగళవారం సదస్సును ఎస్సై సూర్య నిర్వహించారు. అత్యవసర సమయంలో టోల్ ఫ్రీ నంబర్లను ఎలా ఉపయోగించాలో వివరించారు.

అశ్వారావుపేట, జూన్ 24: మాదక ద్రవ్యాలతో జీవితాలు నాశనమవుతాయని ఎస్సై యయాతి రాజు హెచ్చరించారు. మాదక ద్రవ్యాల నిర్మూలన వారోత్సవాల్లో భాగంగా మంగళవారం అశ్వారావుపేట ప్రజలకు అవగాహన కల్పించారు.

సంఘ విద్రోహులకు సహకరించొద్దు

మాట్లాడుతున్న అడిషనల్ ఎస్పీ నరేందర్

పాల్వంచ రూరల్, జూన్ 24: సంఘ విద్రోహులకు వలస ఆదివాసీలు ఏ రూపంలోనూ సహకరించవద్దని అడిషనల్ ఎస్పీ (ఆపరేషన్స్) జి.నరేందర్ కోరారు. మండలంలోని మల్లారం పంచాయతీలోగల వలస ఆదివాసీ గ్రామమైన మామిడికుంటను డీఎస్పీ సతీష్‌కుమార్‌తో కలిసి మంగళవారం సందర్శించారు. గ్రామస్తులతో మాట్లాడుతూ.. ముఖ్యంగా మావోయిస్టులకు సహకరించవద్దని కోరారున. ఏవైనా సమస్యలు ఉన్నట్లయితే తమ దృష్టికి తెస్తే తప్పక పరిష్కరిస్తామని అన్నారు. గ్రామంలోకి అపరిచితులు/అనుమానితులు వచ్చినట్లయితే తమకు సమాచారం ఇవ్వాలని కోరారు. స్థానిక సమస్యలను తెలుసుకున్నారు. గ్రామస్తులకు దుప్పట్లు, విద్యార్థులకు స్టడీ మెటీరియల్ అందించారు. రూరల్ ఎస్సై సురేష్, సిబ్బంది పాల్గొన్నారు.

పారిశుధ్య పనులు చేపట్టాలని వినతి

వినతి పత్రం ఇస్తున్న బీఆర్ఎస్ నాయకులు

లక్ష్మీదేవిపల్లి, జూన్ 24: మండలంలోని 31 పంచాయతీల్లోని సమస్యలను పరిష్కరించాలని కోరుతూ బీఆర్ఎస్ మండల అధ్యక్షుడు కొట్టి వెంకటేశ్వర్లు ఆధ్వర్యంలో నాయకులు మంగళవారం ఎంపీడీవో కార్యాలయంలో వినతిపత్రం ఇచ్చారు. పంచాయతీల్లో పారిశుధ్యం మెరుగుపరచాలని, వీధి దీపాలు ఏర్పాటు చేయాలని, పంచాయతీ సిబ్బందికి వేతనాలు ఇవ్వాలని కోరారు. తాడూరి రజాక్, కోరం చంద్రశేఖర్, ఇక్బాల్ పాషా, బట్టు కనకరాజు, శ్రీకాంత్ నాయక్, పాదిలి వెంకటాచలం తదితరులు పాల్గొన్నారు.

సీజనల్ వ్యాధుల పట్ల అప్రమత్తంగా ఉండాలి

దుమ్ముగూడెం : నిల్వ ఉన్న నీటిని తొలగిస్తున్న వైద్యులు

ఆళ్లపల్లి : వైద్య పరీక్షలు నిర్వహిస్తున్న డా. సంఘమిత్ర

దుమ్ముగూడెం, జూన్ 24: సీజనల్ వ్యాధుల పట్ల ప్రజలు అప్రమత్తంగా ఉండాలని దుమ్ముగూడెం పీహెచ్‌సీ వైద్యులు రుక్మాకర్ అన్నారు. మంగళవారం మండల పరిధిలోని ములకపాడు సబ్‌సెంటర్ పరిధిలోని అచ్యుతాపురం గ్రామాన్ని వైద్య సిబ్బందితో కలిసి సందర్శించారు. ప్రతి ఇంటికి వెళ్లి నిల్వ ఉన్న నీటితొట్టెల్లో నీటిని పారబోయించి దోమలు వ్యాప్తి చెందకుండా ఉండేలా మురుగులేకుండా చూసుకోవాలని పలు సూచనలు చేశారు. ఈ కార్యక్రమంలో ఏఎన్ఎం, హెల్త్ అసిస్టెంట్ గంగాధర్ గౌడ్, ఆశాలు పాల్గొన్నారు.

ఆళ్ళపల్లి, జూన్ 24: పరిసరాల పరిశుభ్రతతోనే ఆరోగ్యంగా ఉండవచ్చునని ఆళ్ళపల్లి పీహెచ్‌సీ వైద్యురాలు కె.వి.సంఘమిత్ర అన్నారు. మంగళవారం మండల పరిధిలోని మర్కోడు సబ్‌సెంటర్ పరిధిలోని బోడాయికుంట, ఈదుళ్ల గ్రామాల్లో ఉచిత వైద్య శిబిరం ఏర్పాటు చేశారు. మొత్తం 85 మందికి వైద్య పరీక్షలు నిర్వహించి జ్వర పీడితులకు మందులు పంపిణీ చేశారు. కార్యక్రమంలో హెచ్.వీ.రమాదేవి, హెల్త్ అసిస్టెంట్లు నరేష్, శ్రీధర్‌బాబు, ఆశ వర్కర్లు కృష్ణకుమారి, చంద్రకళ తదితరులు పాల్గొన్నారు.

అభివృద్ధి పనులకు శంకుస్థాపన

దమ్మపేట, జూన్ 24: మండలంలో సీసీ రోడ్లు, పాఠశాల ప్రహరీలు, తాగునీటి బోరు మోటర్లు, పైప్‌లైన్లు, చేతి పంపులు తదితర అభివృద్ధి పనులకు ఎమ్మెల్యే జారే ఆదినారాయణ మంగళవారం శంకుస్థాపన చేశారు. ముఖ్యమంత్రి సహాయ నిధి లబ్ధిదారులకు చెక్కులు ఇచ్చారు.

అంబేద్కర్ విగ్రహం ధ్వంసంపై నిరసన

కొత్తగూడెం అర్బన్, జూన్ 24: వైరా మండలం సిరిపురం గ్రామంలో అంబేద్కర్ విగ్రహాన్ని ధ్వంసం చేయడంపై జై భీమ్‌రావ్ భారత్ పార్టీ(జేబీపీ) నాయకులు మంగళవారంకొత్తగూడెం పోస్టాఫీస్ సెంటర్‌లో అంబేద్కర్ విగ్రహం వద్ద నిరసన తెలిపారు. యెర్రా కామేష్, గంధం మల్లికార్జున్‌రెడ్డి, వీరూనాయక్, అల్లకొండ శరత్, ధనుంజయ్, సోను, జైసింగ్ తదితరులు పాల్గొన్నారు.

సెక్యూరిటీ సిబ్బందికి శిక్షణ ప్రారంభం

కొత్తగూడెం సింగరేణి, జూన్ 24: సింగరేణివ్యాప్తంగా ఎస్ అండ్ పీసీ సెక్యూరిటీ గార్డులకు ట్రాఫిక్ కంట్రోల్ శిక్షణ తరగతులు మంగళవారం కార్పొరేట్ ఎస్ అండ్ పీసీ ట్రైనింగ్ సెంటర్‌లో ప్రారంభమయ్యాయి. వీటిని ఏరియా సెక్యూరిటీ/ట్రైనింగ్ ఆఫీసర్ జాకీర్ హుస్సేన్ ప్రారంభించారు. ట్రైనింగ్ ఇన్‌స్పెక్టర్ నారాయణరెడ్డి, ఎస్సై మదార్ తదితరులు పాల్గొన్నారు.

ఏఐఎస్ఎఫ్ నాయకుల ధర్నా

పాల్వంచ, జూన్ 24: అధిక ఫీజులు వసూలు చేయడాన్ని నిరసిస్తూ స్థానిక నారాయణ పాఠశాల ఎదుట ఏఐఎస్ఎఫ్ నాయకులు మంగళవారం ధర్నా నిర్వహించారు. ఈ విషయం తెలుసుకున్న డీఈవో స్పందించారు. ఎంఈవో శ్రీరాంమూర్తిని పంపించారు. స్టేషనరీ, యూనిఫాం ఉంచిన గదిని ఎంఈవో సీజ్ చేశారు. ధర్నాలో జిల్లా కార్యదర్శి ఫహీం ఖాన్, నాయకులు వర్క అజిత్, గుండాల సృజన, ఇనపల్లి పవన్‌సాయి, అక్కినపల్లి నాగేంద్రబాబు, వినయ్ తదితరులు పాల్గొన్నారు.

'పేట' మున్సిపల్ కమిషనర్‌గా నాగరాజు

అశ్వారావుపేట టౌన్ 24: అశ్వారావుపేట మున్సిపల్ కమిషనర్‌గా బి.నాగరాజు మంగళవారం విధుల్లో చేరారు. ఆయన ఇప్పటివరకూ వరంగల్ జిల్లా నర్సంపేటలో శానిటరీ ఇన్‌స్పెక్టర్‌గా పనిచేశారు. ఉద్యోగోన్నతిపై కమిషనర్‌గా వచ్చారు.

పాఠశాల తనిఖీ

చంద్రుగొండ, జూన్ 24: మండలంలోని తిప్పనపల్లి జీపీఎస్‌ను ఐటీడీఏ అకడమిక్ కమ్యూనిటీ మానిటరింగ్ ఆఫీసర్ రమేష్ మంగళవారం తనిఖీ చేశారు. విద్యార్థులకు పాఠ్య పుస్తకాలు పంపిణీ చేశారు. ప్రధానోపాధ్యాయుడు ఇస్లావత్ వీరన్న, ఎస్‌సీఆర్‌పీ హరిలాల్ పాల్గొన్నారు.

భద్రాద్రి రామయ్యకు నిత్యకల్యాణం

కల్యాణం నిర్వహిస్తున్న అర్చకులు

భద్రాచలం, జూన్ 24: భద్రాచలం సీతారామచంద్రస్వామి దేవస్థానంలో స్వామివారికి మంగళవారం అర్చకులు నిత్యకల్యాణం నిర్వహించారు. తెల్లవారుజామున ఆలయ తలుపులు తెరిచి సుప్రభాత సేవ, ఆరాధన, ఆరగింపు, సేవాకాలం, నిత్యహోమాలు, నిత్యబలిహరణం తదితర నిత్యపూజలు జరిపారు. గాలిగోపురానికి అభిముఖంగా ఉన్న ఆంజనేయస్వామి వారికి ఉదయం పంచామృతాభిషేకం చేసి తమలపాకులు, సింధూరంతో పూజలు నిర్వహించారు. అనంతరం స్వామివారి నిత్యకల్యాణ మూర్తులను బేడా మండపానికి తీసుకువచ్చి శాస్త్రోక్తంగా నిత్యకల్యాణం నిర్వహించారు.

రైతులకు ఏం చేశారని విజయోత్సవాలు..?

భద్రాచలం, జూన్ 24: కాంగ్రెస్ ప్రభుత్వంలో ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి రైతులకు ఏం చేశారని, ఏముఖం పెట్టుకుని విజయోత్సవ సంబరాలు చేస్తున్నారని భద్రాచలం బీఆర్ఎస్ నియోజకవర్గ ఇన్‌చార్జ్ మానే రామకృష్ణ విమర్శించారు. మంగళవారం ఆయన మాట్లాడుతూ.. ఈ సంబరాలు స్థానిక సంస్థల ఎన్నికల కోసమేనా అని ప్రశ్నించారు. బూటకపు మాటలతో ప్రజలను మభ్యపెట్టడం కోసం మాయమాటలతో ప్రజలను, రైతులను మళ్లీ మోసం చేసేందుకు రైతుభరోసా సంబరాలు చేసుకోవడంపై ఆయన మండిపడ్డారు. ఇప్పటికే 60శాతం మందికి రుణమాఫీ కాలేదని, సీఎం రేవంత్‌రెడ్డి రైతులకు తక్షణమే క్షమాపణ చెప్పాలని డిమాండ్ చేశారు.

భద్రాచలం బస్టాండ్‌లో ఆర్వో ప్లాంట్

భద్రాచలం, జూన్ 24: ప్రయాణీకులకు మంచినీటి సౌకర్యార్థం ఆర్టీసీ యాజమాన్యం కూలర్ ఏర్పాటు చేయగా ఆర్వో ప్లాంట్ కోసం భద్రాచలం బస్‌స్టేషన్ మేనేజర్ అల్లం నాగేశ్వరరావు ముత్తంగి బుచ్చిరామయ్య, యతిరాజుల చారిటబుల్ ట్రస్టు రాజమండ్రి వారి సహకారంతో రూ.45వేలతో ఆర్వో ప్లాంట్‌ను ఏర్పాటు చేశారు. ఈ ప్లాంట్‌కు సహకరించిన ముత్తంగి బుచ్చి రామయ్య, యతిరాజుల చారిటబుల్ ట్రస్టు వారికి డిపో మేనేజర్ తిరుపతి, అసిస్టెంట్ మేనేజర్ గౌతమి ప్రత్యేక కృతజ్ఞతలు తెలిపారు.

పోగొట్టుకున్న సెల్‌ఫోన్ అప్పగింత

భద్రాచలం, జూన్ 24: భద్రాచలం డిపోకు చెందిన కండక్టర్ సురేఖకు ఖమ్మం డ్యూటీ చేస్తుండగా మంగళవారం బస్సులో సెల్‌ఫోన్ దొరికింది. ఆ సెల్‌ఫోన్‌ను కండక్టర్ తీసుకువచ్చి స్టేషన్ మేనేజర్ అల్లం నాగేశ్వరరావుకు అప్పగించారు. ఫోన్‌కు వచ్చే నెంబర్ల ఆధారంగా గిరిజన కార్పొరేషన్‌లో జూనియర్ అసిస్టెంట్‌గా పనిచేస్తున్న భూక్యా బాలుదిగా గుర్తించి ఆ వ్యక్తికి ఫోన్ చేయగా ఆర్టీసీ బస్టాండ్‌కు రావడంతో సెల్‌ఫోన్‌ను అప్పగించారు.

పబ్లిక్ టాయిలెట్లు మంజూరు చేయాలి

కరకగూడెం, జూన్ 24: మండల కేంద్రమైన కరకగూడెంలో ప్రయాణీకులు, వాహనదారులు, ప్రజల కోసం పబ్లిక్ టాయిలెట్లు లేక అనేక ఇబ్బందులు పడుతున్నారని, వెంటనే పబ్లిక్ టాయిలెట్లు మంజూరు చేయాలని కరకగూడెం ఆటో యూనియన్ సభ్యుడు యలగొండ శ్రీను అన్నారు. ఈ సందర్భంగా ఎంపీడీవో కార్యాలయంలో ఆటో యూనియన్ నాయకులతో కలిసి ఎంపీడీవో దేవ వరకుమార్‌కు మంగళవారం వినతిపత్రం అందజేశారు. ఈ కార్యక్రమంలో కొమరం సాంబశివరావు, గుడ్ల రంజిత్, ఇలియాజ్, కొమరం శ్రీకాంత్, ముత్యాల మధు, సిద్ది వినయ్, సతీష్, కణితి రాము తదితరులు పాల్గొన్నారు.

మారుమూల ప్రాంతాల అభివృద్ధే ప్రభుత్వ లక్ష్యం

సీసీ రోడ్డును ప్రారంభిస్తున్న ఎమ్మెల్యే పాయం

మణుగూరు టౌన్, జూన్ 24: మారుమూల ప్రాంతాలను అభివృద్ధి చేయడమే ప్రభుత్వ లక్ష్యమని పినపాక ఎమ్మెల్యే పాయం వెంకటేశ్వర్లు అన్నారు. మణుగూరు మున్సిపాలిటీలోని శాంతినగర్‌లో సుమారు రూ.10 లక్షలతో నిర్మించిన సీసీ రోడ్డును మంగళవారం ఆయన ప్రారంభించారు.

బాలికల ఉన్నత పాఠశాల ప్రారంభం

మున్సిపాలిటీ పరిధిలోని శివలింగాపురంలో నూతనంగా రూ.25 లక్షల అంచనా వ్యయంతో నిర్మించిన ప్రభుత్వ బాలికల ఉన్నత పాఠశాలను ఎమ్మెల్యే పాయం ప్రారంభించారు. ప్రభుత్వ విద్యను బలోపేతం చేసేందుకు అన్ని రకాల వసతులను కల్పిస్తున్నామన్నారు. ఈ కార్యక్రమాల్లో కాంగ్రెస్ నాయకులు, అధికారులు పాల్గొన్నారు.

పలు గ్రామాల్లో కమ్యూనిటీ పోలీసింగ్

గొత్తికోయ ప్రజలతో మాట్లాడుతున్న టేకులపల్లి సీఐ సురేష్

ఆళ్ళపల్లి, జూన్ 24: సంఘ విద్రోహ శక్తులకు ఆశ్రయం ఇవ్వొద్దని టేకులపల్లి సీఐ సురేష్, ఆళ్ళపల్లి ఎస్సై యం.సోమేశ్వర్ అన్నారు. ఉన్నతాధికారుల ఆదేశాల మేరకు కమ్యూనిటీ కాంటాక్ట్‌లో భాగంగా మంగళవారం మండలంలోని పలు ఆదివాసీ గ్రామాల్లో ప్రజలతో పోలీసులు సమావేశమయ్యారు. అసాంఘీక శక్తులు తమ రక్షణ కోసం ఛత్తీస్‌గఢ్ ప్రాంతానికి దగ్గరగా ఉన్న తెలంగాణ సరిహద్దు గ్రామాల్లోకి ప్రవేశించే అవకాశం ఉన్నందున గుర్తు తెలియని వ్యక్తులు, మావోయిస్టులు, సానుభూతిపరులు గ్రామానికి వస్తే పోలీసులకు సమాచారం ఇవ్వాలని తెలిపారు. ఈ కార్యక్రమంలో పోలీస్‌శాఖ సిబ్బంది పాల్గొన్నారు.

'రైతు భరోసా' రూ.305 కోట్లు చెల్లింపు

విజయోత్సవంలో కలెక్టర్, ఎమ్మెల్యే

అశ్వారావుపేట, జూన్ 24: జిల్లాలో రైతు భరోసా కింద 1,76, 236 మంది రైతులకు రూ.305.09 కోట్ల పంట పెట్టుబడి సాయం అందించినట్లు కలెక్టర్ జితేష్ వి.పాటిల్, ఎమ్మెల్యే జారే ఆదినారాయణ తెలిపారు. సీఎం రేవంత్‌రెడ్డి మంగళవారం వీడియో కాన్ఫరెన్స్ ద్వారా నిర్వహించిన 'రైతు భరోసా' విజయోత్సవంలో స్థానిక రైతు వేదిక నుంచి వారు పాల్గొన్నారు. జిల్లా రైతులకు చెల్లించిన రైతు భరోసా వివరాలను కలెక్టర్ తెలిపారు. ఈ కార్యక్రమం తర్వాత.. బయోచార్ తయారీ, అజోల్లా, మునగ పెంపకంపై రైతులకు అవగాహన కల్పించారు. రైతు వేదిక ప్రాంగణంలో మునగ, ఉసిరి మొక్కలు నాటారు. ట్రైనీ కలెక్టర్ సౌరభ్, డీపీవో బాబూరావు, జిల్లా ఉద్యానాధికారి జంగా కిషోర్, మున్సిపల్ కమిషనర్ కె.సుజాత, ఏడీఏ రవికుమార్, సొసైటీ చైర్మన్ చిన్నంశెట్టి సత్యనారాయణ, డిస్కం ఏడీఈ వెంకటరత్నం, తహసీల్దార్ సీహెచ్‌వీ రామకృష్ణ తదితరులు పాల్గొన్నారు.

కొత్తగూడెం టౌన్, జూన్ 24: మండలంలోని మూడు రైతు వేదికల్లో మంగళవారం సాయంత్రం 'రైతు భరోసా' విజయోత్సవం జరిగింది. సొసైటీ చైర్మన్ మండె వీరహన్మంతరావు, మండల వ్యవసాయ అధికారి నర్మద, తహసీల్దార్ కృష్ణప్రసాద్, ఏఈ కిషన్, ఏఈవో శరత్ తదితరులు పాల్గొన్నారు.

పరిమితికి మించి వైద్యం చేయొద్దు

ఇల్లెందు, జూన్ 24: ఆర్ఎంపీలు పరిమితికి మించి వైద్యం చేయొద్దని ఇల్లెందు డీఎస్పీ చంద్రభాను కోరారు. ఇల్లెందు పోలీస్ స్టేషన్‌లో ఆర్ఎంపీల సమావేశాన్ని ఎస్సై సూర్య మంగళవారం నిర్వహించారు. డీఎస్పీ మాట్లాడుతూ.. ఆర్ఎంపీలు తమ వద్దకు వచ్చిన రోగులకు ఒకటి, రెండు రోజులకంటే ఎక్కువ వైద్యం చేయవద్దని అన్నారు. పరిమితికి మించి వైద్యం చేస్తే కఠిన చర్యలు ఉంటాయని హెచ్చరించారు. సీజనల్ వ్యాధులపై ప్రజలకు అవగాహన కల్పించాలని కోరారు. ఎస్సై హసీనాపఠన్ పాల్గొన్నారు.

దిష్టిబొమ్మ దహనం

దమ్మపేట, జూన్ 24: ఇరాన్ దేశంపై ఇజ్రాయిల్, అమెరికా కలిసి సాగిస్తున్న యుద్ధ దాడిని నిరసిస్తూ దిష్టిబొమ్మను అఖిలపక్ష నాయకులు మంగళవారం స్థానిక బాలాజీ సెంటర్‌లో దహనం చేశారు. అమర్లపూడి రాము (సీపీఐ-ఎంఎల్ మాస్‌లైన్), మోరంపూడి శ్రీనివాసరావు (సీపీఎం), సుంకిపాక ధర్మా (సీపీఐ), పండూరి వీరబాబు (ఏఐయూకేఎస్), జుంజునూరి ముక్తేశ్వరి (పీఓడబ్ల్యూ) తదితరులు పాల్గొన్నారు.

అశ్వారావుపేట, జూన్ 24: ఇరాన్‌పై ఇజ్రాయిల్-అమెరికా సాగిస్తున్న దాడులను నిరసిస్తూ సీపీఐ ఎంఎల్ (మాస్‌లైన్) నాయకులు మంగళవారం అశ్వారావుపేటలో దిష్టిబొమ్మ దహనం చేశారు. గోకినపల్లి ప్రభాకర్, వాసం బుచ్చిరాజు, బాడిస లక్ష్మణరావు, కుంజా అర్జున్, తెల్లం సత్యం, కణితి జోగారావు తదితరులు పాల్గొన్నారు.